RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 227 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 20 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-



## గాంధీభవన్‌కు పోటెత్తుతున్న ఆశావహులు

# నా సీటు పక్కా..!

## ఊహల పల్లకీలో ఆశఆవహులు

### పార్లమెంటు టిక్కెట్ల కోసం బెర్త కన్ఫర్మ్ చేసుకుంటున్న సీనియర్లు!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో BRS ని మట్టి కరిపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలు ఉంటే 11 స్థానాల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది.. దీంతో పార్లమెంట్ ఎన్నికలపై ఆ పార్టీ గురి పెట్టింది.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న నల్లగొండ, భువనగిరి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది.. ఈ రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు సీనియర్లతో పాటు జూనియర్ లు కూడా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.. హస్తినలో లాబీయింగ్ లు చేస్తున్నారు.. సీనియర్ నేత జానారెడ్డి మాత్రం తన మనసులో మాట చెప్పేశారు.. పార్టీ పెద్దలాదేశిస్తే నల్లగొండ నుంచి ఎంపి స్థానానికి పోటీ చేస్తానని ప్రకటించారు.. అధిష్టానం పెద్దలు చెప్పారనే అసెంబ్లీ స్థానాన్ని సైతం త్యాగం చేసానని అనుచరులు వద్ద చెబుతున్నారట.. అధిష్టానం పెద్దలు కచ్చితంగా తనకు ఎంపీ సీటు ఇస్తారని ఆయన కాన్ఫిడెంట్ గా ఉన్నారు.. సూర్యాపేట అసెంబ్లీ టికెట్ ఆశించిన పటేల్ రమేష్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని అప్పట్లో అధిష్టానం హామీ ఇవ్వడంతో ఆయన కూడా ఎంపీ టికెట్ రేస్ లో ఉన్నారు.. మరోపక్క భువనగిరి ఎంపీ సీట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన అనుచరుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, బీసీ కోటాలో సూర్యాపేట డిసిసి అధ్యక్షులు వెంకన్న యాదవ్ టికెట్ ఆశిస్తున్నారు.. తెలంగాణలో కాంగ్రెస్ హవా ఉండడంతో.. సీట్ల కోసం నేతలు ఫైట్లు చేస్తున్నారు..

# కారు.. కమలం కలవాలన్నది ఎవరి ప్లాన్?

హైదరాబాద్ : గడిచిన కొద్దిరోజులుగా తెలంగాణ రాజకీయాల్లో ఒక ఆసక్తికర రాజకీయ చర్చ నడుస్తోంది. తెలంగాణ విపక్షం బీఆర్ఎస్.. మరో పార్టీ బీజేపీ మధ్య ఎన్నికల పొత్తు పొడవనుందన్న మాట బలంగా వినిపిస్తోంది. ఇందులో నిజం మాట ఎంతన్నది ఒక మాట అయితే.. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు పొడవాలని బలంగా అనుకుంటున్న వారెవరు? అన్నది ప్రశ్న. కమలం వర్సెస్ కారు పార్టీల మధ్య నడిచిన లడాయి అంతా ఇంతా కాదు. ఒకరిపై ఒకరు అనుకున్న మాటలు ఒక రేంజ్ లో ఉంటాయి. అంతేనా.. డైలీ బేసిస్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి మంత్రి హోదాలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు.. అన్న మాటలు తక్కువేం కావు. అయితే..రాజకీయాల్లో శాశ్విత మిత్రులు.. శాశ్విత శత్రువులు అన్నది ఎవరూ ఉండరన్న నానుడికి తగ్గట్లే.. కమలం.. కారు మధ్య పొత్తు పొడవాలన్న డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. అయితే.. ఈ ప్రపోజల్ వచ్చింది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నుంచి అని చెబుతున్నా.. వాస్తవం మాత్రం అందుకు భిన్నమని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బలంగా ఎదుర్కోవాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కమలం పార్టీతో దోస్తానా చేయటానికి మించిన ప్రత్యామ్నాయం మరేమీ లేదన్న మాట కారు పార్టీ నేతల నోటి నుంచి పార్టీ అధినేత కేసీఆర్ దగ్గర వ్యాఖ్యానిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ మర్చిపోలేని పాయింట్ ఏమంటే.. కేసీఆర్ వద్దకు వెళ్లి.. ఈ తరహా సూచనలు చేసే సత్తా ఎవరికి ఉంది? ఆయన మనసుకు భిన్నంగా మాట్లాడే ధైర్యం ఎవరికి ఉంది? ఓవైపు మోడీని ఉద్దేశించి అన్నేసి మాటలు అనేసి.. ఇప్పుడు




ఎన్నికల్లో పొత్తు అంటే అదేమీ చిన్న మాట కాదు. పరిస్థితి బాగోలేనప్పుడు.. టైం ఎదురుతిరిగిన వేళ మోడీషాల వద్దకు వెళ్లి పొత్తు మాట మాట్లాడితే వారి నుంచి వచ్చే ప్రపోజల్స్ ఎంతలా ఉంటాయన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ సిద్ధమంటే దానికి కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాత్రమే చెప్పాలి. ఆయన దూకుడుకు కళ్లాలు వేసేందుకు బీజేపీతో ప్రస్తుతానికి చేతులు కలిపితే.. ఆ తర్వాత చేయాల్సింది చేయొచ్చన్నది గులాబీ నేతల మాటగా చెబుతున్నారు. ఇంతకూ కేసీఆర్ వద్దకు బీజేపీతో పొత్తు ప్రస్తావన తీసుకెళ్లింది ఎవరు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మాజీ మంత్రి కం గులాబీ పార్టీలో కీలక భూమిక పోషించే కుమారరత్నం కేటీఆర్ నుంచే ఈ ప్రపోజల్ వెళ్లినట్లుగా తెలుస్తోంది. దీనికి హరీశ్ ఆమోదం కూడా ఉందంటున్నారు. అంతకంతకూ ఎక్కువ అవుతున్న రేవంత్ అధిక్యాన్ని తగ్గించేందుకు కేటీఆర్ ఈ సూచన చేసినట్లుగా చెబుతున్నారు. బీజేపీతో చేతులు కలిపితే.. రాష్ట్రంలో బీజేపీ మిత్రపక్షంగా మారటంతో పాటు.. కేంద్రంలో పవర్ లోకి వచ్చే మోడీ సర్కారుతో రేవంత్ దూకుడుకు కళ్లాలు వేయొచ్చన్నది ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతానికి రేవంత్ గండం నుంచి బయటపడేందుకు బీజేపీతో చెలిమి చేసినా తప్పేం కాదన్నది కేటీఆర్ ఆలోచనగా చెబుతారు. బీజేపీతో చేతులు కలపటం ఎందుకు? అంటూ ప్రశ్నించే గులాబీ నేతలు మిస్ అయ్యే అసలు పాయింట్ ఏమంటే.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ కు రెండు.. మూడు స్థానాలకు మించి గెలిచే అవకాశం లేదంటున్నారు. అదే జరిగితే ఉనికికే ప్రమాదంగా మారుతుందని.. పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని.. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీతో పొత్తు పెను ప్రమాదం నుంచి బయటపడేలా చేస్తుందన్నది గులాబీ ముఖ్యనేత ఆలోచనగా చెబుతున్నారు. ఈ వాదనతో గులాబీ బాస్ కేసీఆర్ సైతం కన్విన్స్ అయ్యారని.. కానీ, బీజేపీతో చేతులు కలిపే విషయంలో సంశయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ.. బీఆర్ఎస్ పొత్తు చర్చ తెర మీదకు వచ్చిందని.. గులాబీ దళం సైతం సానుకూలంగా స్పందించే అంశాన్ని సారుకు చూపిస్తే ఆయన మనసు మారుతుందన్న ఆశతో జరుగుతున్నదే అసలు కథంతా అని చెబుతున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

## జీవో నంబర్ 3ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆడబిడ్డలకు తీరని అన్యాయం చేస్తోందని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఉద్యోగ అవకాశాల్లో మహిళల హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రోస్టర్ పాయింట్లు లేని సమాంతర రిజర్వేషన్లు



అమలు చేయాలనే నిర్ణయం తీసుకోవడం సరైన పద్ధతి కాదని చెప్పారు. తెలంగాణలో మహిళల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. నియామకాల్లో అన్యాయం జరిగేలా తీసుకొచ్చిన జీవో నంబర్ 3ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాసినట్లు ఆమె తెలిపారు.

# సబ్సిడీ సిలిండర్లపై

## కీలక నిర్ణయం దిశగా...!



## హామీల అమలుకు చకచకా అడుగులు!!

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు పై కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వీటిలో రెండు పాక్షికంగా అమలు ప్రారంభించింది. మిగిలిన వాటిలో రూ 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం పైక కదలిక వచ్చింది. దీని పైన పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వానికి అమలు పై ప్రతిపాదనలు అందించారు. ఇందులో కీలక సూచనలు చేసారు.

**మరో పథకం అమలు :** మహిళలకు నాడు ఇచ్చిన మహాలక్ష్మి పథంలో కీలక మైన సబ్సిడీ పైన గ్యాస్ సిలిండర్లు ఇవ్వటం పైన ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తాజాగా అధికారులు రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్నవారినే ఈ పథకంలో లబ్దిదారులుగా ఎంపిక చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. సిలిండర్లు దుర్వినియోగం కాకుండా లబ్దిదారుల బయోమెట్రిక్ తీసుకోవాలనే నిబంధన ప్రతిపాదించినట్లు సమాచారం. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. వంద రోజుల్లోగా హామీలు అమలు చేయాల్సి ఉంది. రూ 500 గ్యాస్ సబ్సిడీ పథకానికి రేషన్ కార్డునే ప్రామణికంగా తీసుకొనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులతో నిమిత్తం లేకుండా లబ్దిదారులను ఎంపిక చేయాలనే ప్రతిపాదన ఉన్నా..అది మరింత ఆలస్యం అవుతుందని భావిస్తున్నారు.

**అధికారుల సూచనలు :** తెలంగాణలో ప్రస్తుతం 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కాగా, రేషన్ కార్డుల సంఖ్య 89.98 లక్షలుగా ఉంది. గివ్ ఇట్ అప్ లో భాగంగా 4.2 లక్షల మంది రాయితీని వదులుకున్నారు. వీరిని మినహాయిస్తే 85.79 లక్షల మంది లబ్దిదారులు ఉంటారు. రేషన్ కార్డు డేటాబేస్ తో మ్యాపింగ్ అయిన గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 63.6 లక్షలుగా ఉంది. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకు రూ 340 రాయితీ అందుతోంది.

మొత్తం కనెక్షన్లలో ఇవి 11. 58 లక్షలు ఉన్నాయి. రాయితీ సిలిండర్లను సంవత్సరానికి ఆరు లేక 12 ఇవ్వాలా...అనే విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ఇందు కోసం అర్హుల కుటుంబంలోని సభ్యుల సంఖ్య..గత ఏడాది వాడిన సిలిండర్ల సంఖ్య..వంటి అంశాలను పరిగణలోకి తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

**సీఎం రేవంత్ నిర్ణయం :** రాష్ట్రంలో ప్రతీ నెలా సిలిండర్ పొందుతున్న వారి సంఖ్య 44 శాతం మంది మాత్రమే ఉన్నారు. కొత్త కార్డులు పొందేవారికీ ఈ పథకం అమలు చేస్తారని చెబుతున్నారు.

కొత్త గ్యాస్ కనెక్షన్లను పరిగణలోకి తీసుకోవద్దని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో..ఈ నెల 28వ తేద నుంచి ఈ పథకం ప్రారంభించాలని తొలుత నిర్ణయించారు. ఇప్పటి వరకు విధి విధానాలు ఖరారు కాకపోవటంతో ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది ఈ రోజు జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పాకిస్థాన్ లో కారు కదలడం లేదు... కారణం ఇదే!

ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులో కొట్టుమిట్టాడుతుందని.. అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు చాలా దారుణంగా పడిపోయాయని.. కరెన్సీ తరుగుదల.. పన్నుల్లో పెరుగుదల భారీగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. ఈ సమయంలో పాకిస్థాన్ తాజా పరిస్థితికి అద్దంపట్టేలా పాకిస్తాన్ ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (పీఏఎంఏ) గణాంకాలు తెరపైకి వచ్చాయి. ఈ లెక్కల్లో భారత్ లో సగం రోజుల్లో అమ్మకాలను పాక్ నెలరోజుల్లో చేరుకోలేకపోవడం గమనార్హం! అవును... ప్రతి నెలా మంచి అమ్మకాలతో ఆటోమొబైల్ మార్కెట్ ఇండియాలో దూసుకుపోతుంటే.. పాకిస్తాన్ లో మాత్రం బాగా క్షీణించింది. ఇందులో భాగంగా నవంబర్ నెలలో పాక్ లో కేవలం 4875 కార్లు మాత్రమే అమ్ముడయ్యాయని పీఏఎంఏ వెలడించింది. దీంతో అక్కడ కార్ల అమ్మకాలు ఈ స్థాయిలో భారీగా పడిపోవడానికి గలకారణాలపై చర్చ మొదలైంది. తగ్గడం అంటే... మరీ దారుణంగా పడిపోవడం వారి ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుందని అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే... పాకిస్తాన్ ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం గత నెలలో పాక్ లో కేవలం 4875 కార్లు అమ్ముడైనట్లు తెలుస్తుంది. అయితే... గత ఏడాది ఇదే నెలలో అక్కడి అమ్మకాలు 15,432 కావడం గమనార్హం. దీనిపై స్పందించిన పరిశీలకులు... నిత్యావసర వస్తువులే కొనలేని పరిస్థితిలో ఉన్న ఆ దేశ ప్రజలకు కార్ల కొనుగోలు అసాధ్యం అని చెబుతున్నారు! ఈ కారణంగానే ఈ ఏడాది పాకిస్తాన్ లో ఆటోమొబైల్ మార్కెట్ దారుణంగా క్షీణించింది. ఇందులో భాగంగా... పాక్ సుజుకి 72 శాతం, ఇండస్ మోటార్ 71 శాతం, హోండా అట్లాస్ కార్ 49 శాతం క్షీణించాయి. ప్రధాన వాహన తయారీదారుల అమ్మకాలే ఇలా ఉండటంతో... మిగిలిన పలు సంస్థలు ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసి ప్లాంట్స్ కూడా మూసివేసాయి.

**భారత్ లో పూర్తి భిన్నంగా అమ్మకాలు!:** పాకిస్థాన్ లో కార్ల అమ్మకాల పరిస్థితి అలా ఉంటే... భారత్ లో కార్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది నవంబర్లో మారుతి సుజుకి ఇండియా సేల్స్ 1,64,439.. టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 17,818 యూనిట్లుగా నమోదవ్వగా... దేశంలో జరిగిన మొత్తం కార్ల అమ్మకాలు సంఖ్య 3.60 లక్షల కంటే ఎక్కువగా ఉంది. అంటే... పాకిస్తాన్ లో అమ్ముడైన కార్ల సంఖ్య.. భారతదేశంలో సగం రోజులో అమ్ముడైన కార్ల సంఖ్య కంటే తక్కువని తెలుస్తోంది! ఇదే సమయంలో... "ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్" గణాంకాల ప్రకారం నవంబర్ లో భారత్ లో టూవీలర్ అమ్మకాలు కూడా గణనీయంగా సుమారు 21 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.

# అటకెక్కిన ఈ-పర్మిట్



నల్గొండ : నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఈ-పర్మిట్ విధానం అటకెక్కింది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో ఈ- విధానం అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినా నేటికీ అమలు జరగడం లేదు. ఈ విధానంతో జీరో కొనుగోళ్లను అరికట్టడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దీనికితోడు రైతులు మద్దతు ధర పొందే వీలుంది.

నిబంధనలు ఇలా..ఉమ్మడి నల్గొండ జిల్లాలో 21 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిల్లో ఎక్కడా ఈ-పర్మిట్ విధానం అమలు కావడం లేదు. ఈ-నామ్ విధానంతో సరకు ఎగుమతికి రైతు చరవాణి సంఖ్యతో వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాతనే ఆన్‌లైన్‌లో అనుమతి వచ్చి ప్రతి పర్మిట్‌కు ఒక నంబరు కేటాయిస్తారు. కొన్న పంట ఉత్పత్తులను వేరే ప్రాంతాలకు తరలించినప్పుడు సరకు వివరాలు కూడా నమోదు చేయాలి. వ్యాపారులు కొనుగోలు చేశాక.. ఒక శాతం మార్కెట్లకు ఫీజు చెల్లించాలి. కానీ ఇలాంటివేమి జరగకపోవడంతో మార్కెట్లు ఆదాయం కోల్పోతోంది.

అక్రమాలకు అడ్డుకట్టఈ-పర్మిట్ విధానం అమలైతే అక్రమ రవాణాకు వీలులేకుండా ఉంటుంది. ఎక్కడికి తరలించారనే సమాచారం కూడా వెంటనే తెలిసిపోతుంది. ఈ-పర్మిట్ విధానాన్ని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. డబ్బు ఎగవేత, అక్రమ నిల్వల నివారణతోపాటు ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఈ-పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

సాంకేతిక సమస్యలు తలెత్తాయి..- నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెట్ అధికారి, సూర్యాపేట సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-పర్మిట్ విధానాన్ని అమలు చేశాం. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తడంతో అమలు సాధ్యం కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి ప్రయత్నం చేస్తాం.

# ఎన్నికల వేళ.. బదిలీల జాతర



ఖమ్మం : కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు లోక్‌సభ ఎన్నికల ముందు వివిధ స్థాయిల్లోని అధికారుల మూకుమ్మడి బదిలీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీ చేసింది. కేటాయించిన జిల్లాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఎన్నికల వేళ సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులను అక్కడి నుంచి తప్పించి ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. దీంతోపాటు ఒకే పోస్టులో మూడేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్న వారికి సైతం స్థానచలనం కల్పిస్తున్నారు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను పెద్ద సంఖ్యలో బదిలీ చేయగా, పీఆర్‌లో ఎంపీడీఓలకు ఆదివారం స్థానచలనం కలిగింది. జడ్పీ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీఆర్డీఓలు, అదనపు డీఆర్డీఓలను సైతం ఒకట్రెండు రోజుల్లో మార్చనున్నారు. మరికొంత మంది పోలీసు అధికారులనూ మార్చే అవకాశం కనిపిస్తోంది. ఆ తర్వాత కలెక్టర్లు సైతం బదిలీ అవుతారని సమాచారం.

కొత్త ప్రభుత్వానికి కలిసొచ్చే అంశం

రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో కొన్నేళ్లుగా పాతుకుపోయిన అధికారులను బదిలీల నిషేధం పేరుతో గత ప్రభుత్వం కొనసాగిస్తూ వచ్చింది. చాలామంది అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కోరుకున్న స్థానాల్లో కొనసాగుతూ వచ్చారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడగా.. కొందరు అధికారులను బదిలీ చేయాలనే ఒత్తిడి పెద్దలపై శ్రేణుల నుంచి ఎదురవుతోంది. ఈ అంశంపై వేచి చూస్తున్న ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు కలిసొచ్చాయి. మరోవైపు తప్పనిసరి బదిలీలను తప్పించుకునేందుకు కొందరు అధికారులు ప్రస్తుత పాలక పార్టీ పెద్దల నుంచి లాబీయింగ్ చేస్తూ, సిఫార్సు లేఖలు పొందినట్లు ఆయా శాఖల్లో చెప్పుకొంటున్నారు. ఇప్పటికీ కొందరు కోరుకున్న స్థానాలకే బదిలీ అవుతున్నారని ప్రచారం సాగుతోంది.

ఎన్నికల్లో సానుకూలతపై దృష్టి!

ఇతర జిల్లాల నుంచి వచ్చేవారు లోక్‌సభ ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదని అధికార కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే అనుమానం ఉన్న అధికారులు తాజా బదిలీలతో జిల్లా వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఎన్నికల తర్వాత తిరిగి సొంత జిల్లాకు వస్తామని వారు చెబుతున్నారు.

18 మంది ఎంపీడీఓలు..

జిల్లాలో 18 మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా... పొరుగు జిల్లాల నుంచి ఖమ్మం జిల్లాకు 19 మందిని కేటాయించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్‌కు.. సీహెచ్ సుభాషిణి, బానోత్ రవికుమార్, షేక్ సిలార్ సాహెబ్, డి. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, బి.వేణుమాధవ్.. భద్రాద్రి కొత్తగూడెంకు బి.అశోక్, తేళ్లూరి శ్రీనివాసరావు, కె.విజయ్‌భాస్కర్‌రెడ్డి, బి.రవీందర్‌రెడ్డి, కావూరి మహాలక్ష్మి, ఆర్.రమాదేవి, వి.డి.వి. అశోక్‌కుమార్, కె.జమలారెడ్డి, ఆర్.రామకృష్ణ, ఎం.చంద్రశేఖర్, డి.కరుణాకర్‌రెడ్డి.. సిద్దిపేట జిల్లాకు.. బాణోత్ జయరాం బదిలీ అయ్యారు. జిల్లాకు మహబూబాబాద్ నుంచి జి. రవీందర్, ఎస్.కుమార్, బి.వేణుగోపాల్‌రెడ్డి, పి.సరస్వతి, ఎ.రోజారాణి, కె.శేషాద్రి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి జి.సురేందర్, జనగామ జిల్లా నుంచి బి.సురేందర్, వి.అశోక్‌కుమార్, శ్రీధర్ స్వామి, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా నుంచి ఎస్.రమేశ్, ఆర్.చిన్న నాగేశ్వరరావు, డి.అన్నపూర్ణ, డి.చంద్రశేఖర్, ఎం.చంద్రమౌళి, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఆర్.రామయ్య, నల్గొండ జిల్లా నుంచి ఎల్.రాజు, సూర్యాపేట జిల్లా నుంచి ఎంపీడీవోలు ఎం.యర్రయ్య, బి.వెంకటేశ్వర్లు రానున్నారు.

# హాజరు లెక్క.. ఇక పక్కా

మెదక్: సమయం పన్నెండు గంటలు దాటినా.... ఆయా శాఖల సిబ్బంది విధులకు హాజరయ్యేవారు. తిరిగి సాయంత్రం ఐదు కాగానే ఠంచన్‌గా తిరిగి వెళ్లేవారు. ఇది గతంలో ఉన్న పాత సమీకృత కలెక్టరేట్‌లో పరిస్థితి. ఐదు నెలల కిందట నూతన భవనంలోకి మారినా సిబ్బంది పరిస్థితిలో మార్పు రాలేదు. ఉదయం ఆలస్యంగా రావడాన్ని గుర్తించిన జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందికి వేలిముద్ర(బయోమెట్రిక్) ద్వారా హాజరు నమోదుకు చర్యలు చేపట్టారు. ఇందుకు బయోమెట్రిక్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో సిబ్బంది ఉదయం వచ్చేటప్పుడు, సాయంత్రం వెళ్లేటప్పుడు వేలిముద్ర వేస్తేనే హాజరు నమోదవుతుంది. ప్రస్తుతం కొన్ని శాఖల సిబ్బంది వివరాలను నమోదు చేశారు. మరికొద్ది రోజుల్లో మిగిలిన శాఖల వారీగా నమోదు చేయనున్నారు. ఈ అంశంపై కథనం...

గతంలో కొద్ది నెలల పాటు

2016 అక్టోబరులో మెదక్ పట్టణ కేంద్రంగా జిల్లా ఆవిర్భవించగా.. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ భవనంలో కలెక్టరేట్ కొనసాగింది. ఆరంభంలోనే అప్పటి పాలనాధికారి భారతి హొళికేరి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా 'ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్' అమలు చేశారు. ప్రతి శాఖలో బయోమెట్రిక్ యంత్రాన్ని అమర్చారు. కొద్దినెలల పాటే ఇది కొనసాగింది. ఆ తర్వాత పాలనాధికారులు మారడంతో పక్కన పడేశారు. గతేడాది ఆగస్టులో ఔరంగాబాద్ శివారులో నిర్మించిన నూతన భవనంలోకి కలెక్టరేట్ మారింది. ప్రస్తుతం ఈ భవనంలో సుమారు 35 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

ఆలస్యంగా రావడంతో...

ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది కార్యాలయానికి నిర్ణీత వేళలకు హాజరుకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉదయం 10.30 గంటల వరకు విధుల్లో చేరాలి. కానీ కొంత మంది మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత కార్యాలయాలకు వస్తున్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పనుల నిమిత్తం ఎక్కువగా క్షేత్రస్థాయికి వెళ్తుంటారు. ఇదే అదునుగా కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఆలస్యంగా



వస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన జిల్లా ఉన్నతాధికారులు బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని నిర్ణయించారు. గత నవంబరులో కార్యాలయ ఆవరణలో యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఐసీ అధికారులు ఆయా శాఖల హెచ్ఓడీల వద్ద ఉద్యోగుల వివరాలను సేకరించారు. శాఖల వారీగా ఉద్యోగుల నుంచి వేలిముద్రలను తీసుకొని, వారి ఐడీ నంబర్, పూర్తి వివరాలు నమోదు చేశారు. ఇలా వ్యవసాయ, భూగర్భజల, ముఖ్య ప్రణాళిక, వెనకబడిన తరగతులు, సహకార, విద్య, పరిశ్రమలు, అల్పసంఖ్యాక వర్గాలు, స్త్రీ,శిశు సంక్షేమం, నీటిపారుదల, మైనింగ్, జిల్లా పంచాయతీ, ఇంటర్మీడియేట్, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన, పశుసంవర్ధక, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల ఉద్యోగుల వివరాలను నమోదు చేశారు. ఇంకా 17 శాఖలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను సేకరించాల్సి ఉంది.

నిర్ణీత సమయానికి ..

కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ యంత్రం ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఆయా శాఖల ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి విధులకు హాజరవుతున్నారు. ఉద్యోగులు ఏ రోజున విధులకు హాజరయ్యారు. నిర్ణీత సమయంలోగా వస్తున్నారా? ముందే వెళ్లిపోతున్నారా? అనే వివరాలు పక్కాగా తెలిసే అవకాశం ఉంది. ఎన్ఐసీ అధికారులు ఆయా శాఖల హెచ్ఓడీలకు వివరాలు అందజేయనున్నారు.

# బండ భారం దిగనుంది..!

నల్గొండ : ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. గృహలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీకీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సామాన్యులకు గ్యాస్ దాదాపు సగం ధరకే రానుండటంతో కాస్త ఊరట కలగనుంది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో విధివిధానాలను రూపొందిస్తోంది. మరో మూడునాలుగు రోజుల్లోనే ఈ పథకానికి సంబంధించి తీపికబురును అందించనున్నట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

వినియోగదారులకు సాంత్వన..ప్రస్తుతం సిలిండర్ ధర దాదాపు రూ. 975 వరకు ఉంది. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను కేవలం రూ. 500లకే అందిస్తే వినియోగదారులకు సాంత్వన కలిగినట్లవుతుంది. జిల్లాలో



మొత్తం 6,08,701 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 80 శాతం మందికి లబ్ధి చేకూరినా.. ప్రతి నెల దాదాపు రూ.15 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది.రేషన్ కార్డే ప్రాతిపదిక..పక్కదారి పట్టకుండా నిజమైన లబ్ధిదారులకే రాయితీ సిలిండర్లు చేరేలా చర్యలు తీసుకోనుంది. ఈ పథకానికి రేషన్‌కార్డును ప్రాతిపదిక చేసుకునే అవకాశం ఉంది. రేషన్ కార్డు లేనివారి పరిస్థితిపై కూడా సమాలోచన చేస్తున్నట్లు తెలిసింది. సంవత్సరానికి ఎన్ని ఇవ్వాలి, కిందటి ఏడాది ఎన్ని తీసుకున్నారు. తదితర వివరాలను ప్రజాపాలన దరఖాస్తుల్లో సేకరించారు. వాటి ఆధారంగా ఇచ్చే అవకాశం ఉంది. జిల్లాలో రూ. 500లకే సిలిండర్ పథకం కోసం దాదాపు 4.60 లక్షల మంది వినియోగదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు.

# అడ్డేలేని మట్టి మాఫియా

సత్తుపల్లి : పట్టణంలో ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, వెంచర్ల పనులు జోరుగా సాగుతుండటంతో మట్టికి డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు గ్రావెల్ దందాకు తెరలేపారు. అసైన్డ్, పట్టా భూములతో పాటు సింగరేణి స్థలాల్లోనూ అడ్డగోలు తవ్వకాలకు తెరలేపారు. గతంలో పలుమార్లు రెవెన్యూ, మైనింగ్ అధికారులు తనిఖీలు చేసినా, జరిమానా చెల్లించిన నాడే, రాత్రికిరాత్రే మళ్లీ తోలకాలు మొదలు పెడుతుండటం గమనార్హం. స్థానిక అధికారులపై రాజకీయంగా ఒత్తిళ్లు వస్తుండటంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారని, అందుకే అక్రమార్కులు చెలరేగిపోతున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి.

రాత్రింబవళ్లు.. ఒకటే రొద

సత్తుపల్లిలో కొన్నాళ్లుగా మట్టి తోలకాలు రాత్రింబవళ్లు కొనసాగుతున్నాయి. ట్రాక్టర్ ట్రిప్పు రూ.800-రూ.1000 వరకు, టిప్పర్ అయితే రూ.3,500-రూ.4,500 వరకు విక్రయిస్తున్నారు. ఒక్కో వెంచర్‌కు



సుమారు రూ.35 లక్షల విలువైన గ్రావెల్ అవసరం ఉండనుండగా.. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు సరఫరా చేస్తున్నారని సమాచారం.

తనిఖీలతో హడావుడి

మట్టి దందాపై పత్రికల్లో కథనాలు వస్తుండటంతో స్థానిక అధికారుల కన్నా.. జిల్లా మైనింగ్ అధికారులే తనిఖీతో కాస్త హడావుడి చేస్తున్నారు. జరిమానా విధించి తర్వాత చేతులు దులిపేసుకుంటున్నారు. గతంలో ఒకరిద్దరికి పరిమితమైన దందాలో మరికొందరు కొత్తగా చేరారు. వీరి మధ్య నెలకొన్న వర్గపోరుతో గతంలో గొడవలు, కొట్లాటలు సైతం జరిగాయి. ఆయా పంచాయితీలు పోలీస్ స్టేషన్ గుమ్మం వరకు చేరిన సందర్భాలున్నాయి. ఇలాంటి మాఫియాను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్య కూడా తలెత్తే అవకాశం లేకపోలేదు. అధికారం యంత్రాంగం, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా అక్రమార్కులను కట్టడి చేయాలి.

'అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వకాలు చేస్తే సహించేది లేదు. దందా చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలను బైండోవర్ చేసాం'.
గంగాధర్, మైనింగ్, ఏజీ, ఖమ్మం

# భవనం ఉంది.. సంకల్పమే తరువాయి

ఖమ్మం : కూసుమంచిలోని జిల్లా రెవెన్యూ అకాడమీ భవనం ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. ఎలాంటి కార్యకలాపాలు లేక, రెవెన్యూ శాఖ పట్టింపునకూ నోచుకోక నిర్మాణం శిథిలావస్థకు చేరుతోంది. భవనానికి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.కూసుమంచి నుంచి గుర్వాయిగూడెం వెళ్లే రహదారిలో 2006లో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. ఈ భవనం విద్యార్థినులు చదువుకునే జడ్పీ ఉన్నత పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉంది. మరోపక్క నిర్మానుష్య ప్రాంతం కావడంతో దీన్ని బాలుర వసతి గృహంగా మార్చి స్థానిక పోలీసు ఠాణా పక్కనే ఉన్న బాలుర వసతి గృహంలోకి బాలికలను తరలించారు. నాటి నుంచి 2010 వరకూ బాలుర వసతి గృహంగా మనుగడ సాగించి ఆ తర్వాత మూడేళ్లపాటు నిరుపయోగంగా ఉండిపోయింది. 2013లో అప్పటి కలెక్టర్ ఈ భవనాన్ని రెవెన్యూ అకాడమీగా మార్చారు. రెవెన్యూ పరమైన జిల్లా స్థాయి కార్యక్రమాలు, సమీక్షలు, ఉద్యోగుల సమావేశాలు, పలు శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే కొనసాగాయి. సుమారు అయిదారేళ్లపాటు ఈ భవనం పూర్తి స్థాయిలో సేవలందించింది. ఆ తర్వాత పరిస్థితి మొదటికొచ్చింది. నిరుపయోగంగా మారి ఉనికి కోల్పోతోంది.మంత్రి దృష్టి సారిస్తే.. నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసి ఆరు విశాల గదులతో అందుబాటులో ఉన్న రెవెన్యూ అకాడమీ భవనంలో దాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. భవనం అందుబాటులో ఉన్న దృష్ట్యా త్వరితగతిన ఈ విషయంపై దృష్టి సారించాలని కొద్ది రోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. ఆయన సానుకూలంగా స్పందించి పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# అనుమతి మూడు.. తరలింపు ఏడు ట్రాక్టర్లు!

వేములవాడ : ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ప్రైవేటు నిర్మాణాల పేరుతో అనుమతి పొందిన కొంత మంది అక్రమార్కులు ఇదే అదనుగా మూలవాగును తోడేస్తున్నారు. నిబంధనల ప్రకారం ట్రాక్టర్‌కు మూడు ట్రిప్పుల చొప్పున అనుమతి ఇస్తే ఏడు ట్రిప్పులు పైగా ఇసుకను తరలిస్తూ మూలవాగును ఖాళీ చేస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి డీడీల రూపంలో రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

వేములవాడ రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు అధికారులు ఇసుక తీసుకునేందుకు వారంలో మూడు రోజులు అనుమతులు జారీ చేస్తున్నారు. అనుమతి ఇచ్చిన రోజు ప్రతి ట్రాక్టర్‌కు మూడు ట్రిప్పుల ఇసుక తీసుకునేందుకు అనుమతి పత్రాలు ఇస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు ఒక్కో ట్రిప్పునకు రూ.300 చలానా కట్టి ఇసుకకు అనుమతి పొందుతున్నారు. వీరికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సమయం కేటాయిస్తూ అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారు. ఇదే అదనుగా కొంత మంది అక్రమార్కులు, ట్రాక్టర్ల యజమానులు, గుత్తేదారులు రెవెన్యూ సిబ్బందిని మచ్చిక చేసుకొని ఇష్టారాజ్యంగా తీసుకెళ్తున్నారు. అయినా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**ఖర్చులకని వసూలు చేసి...**

మూలవాగు నుంచి ఇసుక తరలించేందుకు 70కి పైగా ట్రాక్టర్లకు అనుమతులిస్తున్నారు. మూలవాగులోకి ఇసుక కోసం వాహనాలు దిగాలంటే వివిధ ఖర్చుల కోసం ట్రాక్టర్ల యజమానులు దాదాపు రూ. 8 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. ఇందులోంచి అమ్యామ్యాలు ముట్టజెప్పి ఇసుక దందాకు తెర తీశారు. మూడు ట్రిప్పులకు అనుమతి తీసుకొని మరో నాలుగైదు ట్రిప్పులను అదనంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలించిన ఇసుకను డంపు చేసి జల్లెడ పట్టించి అదను చూసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల కొందరు ఫిర్యాదు చేయడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు తొమ్మిది ట్రాక్టర్లను పట్టుకొని ఒక్కొక్క దానికి రూ.2 వేల చొప్పున జరిమానా ఇసుకతో వాటిని వదిలి పెట్టడం విమర్శలకు తావిచ్చింది.

**దందాలో మరో కోణం**

ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా ఇసుకకు అనుమతులిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇది అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు ఏ మేరకు ఇసుక అవసరమవుతుందనేది ఇంజినీరింగ్ అధికారుల ధ్రువీకరణ లేకుండానే తరలింపునకు అనుమతి ఇస్తున్నారు. ఇది అక్రమార్కులకు కలిసొస్తుంది. ఓ ప్రభుత్వ నిర్మాణ పనికి 50 ట్రిప్పుల ఇసుక అవసరమైతే గుత్తేదారు మరో 50 ట్రిప్పులు అక్రమంగా ప్రైవేటు పనుల వద్దకు తరలిస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు.

**అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు**
**– మహేశ్‌కుమార్, తహసీల్దార్, వేములవాడ**

ఇసుకను ఎవరు అక్రమంగా తరలించినా చర్యలు తీసుకుంటాం. ఇటీవల సమయం దాటిన తరవాత ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని జరిమానా వేశాం. నిర్ణీత సమయంలోనే ఇసుకను తరలించ డానికి అనుమతి ఇవ్వడం జరిగింది. అదనంగా ఇసుక టిప్పుల తరలింపుపై నిఘా పెడతాం.

# ఇటుక బట్టీ.. బతుకు మట్టి!

పెద్దపల్లి : ఒక బట్టిలో పనిచేసే వలస కూలీలు ఎంతమంది.. వారు ఎక్కడి నుంచి వచ్చారు.. కూలీలను పంపించిన ఏజెన్సీకి ప్రభుత్వ గుర్తింపు కలిగిఉందా.. నిబంధనల ప్రకారం కూలీలకు వేతనాలు అందుతున్నాయా.. పనిగంటలు, పనికేంద్రాల్లో పరిస్థితులు, నివాస ప్రాంతాల్లో వసతులు ఎలా ఉన్నాయనే అంశాలు ఎవరికీ పట్టడం లేదు. సమస్య వచ్చినప్పుడు ఉరుకులు పరుగులు తీయడం మినహా వలసకూలీల ఇబ్బందులపై దృష్టిసారించడం లేదు. అధికారులను బట్టీల నిర్వాహకులు సంతృప్తి చేయడంతోనే సగం సమస్యలు పరిష్కారమైనట్లు రికార్డులలో రాసుకోవడం రివాజవుతుంది కానీ.. జిల్లాలో ఎన్ని ఇటుక బట్టీలున్నాయి? వీటిలో ఎన్నింటికి అనుమతులు తీసుకున్నారు? వలస కూలీల వివరాలు, చిన్నపిల్లలు, బడిఈడు పిల్లలు, వృద్ధులు వంటి వివరాలేవీ ఉండవు. కనీసం వాటిని తెలుసుకునేందుకు కూడా కార్మిక, సంక్షేమశాఖ ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు గౌరెడ్డిపేట ఇటుక బట్టీలోని ఇద్దరు కూలీలు మృతిచెందిన తర్వాత వెల్లువెత్తుతున్నాయి.

**పట్టింపేదీ?**

కూలీలు ఏడాదిలో ఆరు నెలల పాటు బట్టీల్లోనే పని చేస్తారు. ఏటా వానాకాలం ప్రారంభించే సమయానికి స్వరాష్ట్రానికి వెళ్లిపోయి అక్టోబర్, నవంబర్ నెలల్లో తిరిగి వస్తారు. వీరి పిల్లలకు చదువు నేర్పించేందుకు గతంలో వర్క్‌సైడ్ పాఠశాలలను ప్రభుత్వం నిర్వహించింది. పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రంలో ఈ పాఠశాలలను ఎత్తివేయడంతో వలస కూలీల పిల్లలకు బడులు లేకపోవడంతో వారు కూడా మట్టిపనుల్లోకి వెళ్లేవారు. ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బట్టీలలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేశారు కానీ.. ఇవి మూణ్ణాళ్ల ముచ్చటగానే మారిపోయాయి. వీరికి క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందించడమూ కష్టసాధ్యంగానే మారిపోయింది. కేవలం రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనే 60కి పైగా బట్టీలున్నాయి. ఒక్కో బట్టీలో కనీసం రెండు వందల మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరికి అత్యవసర వైద్యసేవలను బట్టీ యజమాని వద్ద పనిచేసే సూపర్‌వైజర్లే అందిస్తున్నారనే ప్రచారముంది. కనీసం శుద్ధ జలం అందించడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ సంస్థలు విఫలమవుతున్నాయి.

**పలువురికి డయాలసిస్ అవసరం**

గౌరెడ్డిపేటలోని ఇటుక బట్టీలో కలుషితాహారం బారిన పడి అస్వస్థతకు గురైన వారిలో కొందరికి డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. కలుషితాహారంతో వాంతులు, విరేచనాలు, శరీరంలో నీటి శాతం తగ్గిపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చిందని వైద్యులు భావిస్తున్నారు. నివాసం ఉంటున్న ప్రాంతం, పనిచేసే ప్రదేశాల్లో ఇన్నాళ్లు కూలీలు తాగిన నీటిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బట్టీల్లోనే ఆవాసాలు ఇటుక బట్టీల్లో పనిచేసే ఒడిశా కూలీలకు యజమానులు బట్టీల సమీపంలోనే తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేస్తారు. ఇటుకలు పేర్చిన గోడలపై రెండు రేకులు లేదా కవర్లు కప్పి ఆవాసం కల్పిస్తున్నారు. వాటి సమీపంలోనే ఒక చేతిపంపు లేదంటే నీటి డ్రమ్ములను ఏర్పాటు చేస్తుంటారు. ఆ నీటినే వంటలు చేసుకోవడం, తాగడం, బహిర్భూమికి వెళ్లడం, స్నానాలు చేయడానికి వినియోగించుకోవాల్సి ఉంటుంది. సమస్యలపై ప్రశ్నించిన కూలీలపై దాడులకు పాల్పడం, బెదిరింపులకు గురిచేయడం సర్వసాధారణం. బట్టి యజమానులు ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగి ఉంటున్నారు. దీంతో అధికారులు సైతం చూసీచూడనట్లు మసలుకోవల్సిన దుస్థితి నెలకొంది.

# గూడు గోడు



గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం మల్కాపూర్ శివారులో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు ఇవి. 700ల ఇళ్లు నిర్మించి గతేడాది లబ్ధిదారుల ఎంపికకు డ్రా తీసినా ఇప్పటికీ ఎవరికీ కేటాయించలేదు.

ఇక్కడ కనిపిస్తున్న అసంపూర్తి నిర్మాణాలు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోనివి. 144 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టిన గుత్తేదారు మధ్యలోనే అర్థాంతరంగా వదిలేశారు. దాదాపు రెండేళ్లుగా ఇదే పరిస్థితి. బిల్లులు రాకపోవడంతో పనులు వదిలేసినట్లు సమాచారం. జగిత్యాల పట్టణానికి చెందిన వారి కోసం 3,600 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. డ్రా పద్ధతిలో ఎన్నికల ముందు హడావుడిగా కేటాయించిన ఈ ఇళ్ల పనులు ఇంకా పూర్తి కాలేదు. విద్యుత్తు సౌకర్యం లేదు. డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు పనులెప్పుడు పూర్తవుతాయోనని ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయినా కేటాయించలేదు. మరికొన్ని ప్రాంతాల్లో పనులు మధ్యలోనే నిలిపివేశారు. కొన్ని పూర్తయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇంకా కొన్నింటిని ఆక్రమించుకుని ఇతరులు నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పథకంలో ఇళ్లు 20 శాతం మందికి కూడా ఇంకా కేటాయించలేదు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి నిరుపేదలకు నివాసం కల్పించాలని అర్హులు కోరుతున్నారు.

లక్ష్యం 23,944 ఇళ్లు..: నాలుగు జిల్లాల పరిధిలో రెండు విడతల్లో 23,944 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. అందులో 13,674 నిర్మాణాలు ఇంకా ప్రారంభించలేదు. ప్రారంభించి పూర్తి చేసినవి కేవలం 6,768 మాత్రమే. అర్థాంతరంగా ఆగిన నిర్మాణాలు 3,502 ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 10,270 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా పూర్తయిన 6,768 ఇళ్లలో జగిత్యాల, మంథని తదితర ప్రాంతాల్లో 4 వేల వరకు లబ్ధిదారులకు కేటాయించారు.

చాలా చోట్ల నిర్మించి వదిలేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసినా వారికి అప్పగించలేదు. పలు ప్రాంతాల్లో అనేక సార్లు లబ్ధిదారులు తాళాలు పగులగొట్టుకుని అందులోకి వెళ్లినా అధికారులు ఖాళీ చేయించారు. తమకు ఇళ్లు వస్తాయని ఎదురు చూస్తున్న పేదలు కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభించకపోవడం తో ఆశలు వదులుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో పూర్తి చేసిన ఇళ్లు ఎవరికీ కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తయిన గృహాలను పేదవారికి కేటాయిస్తే అందులో నివాసం ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇళ్ల కేటాయింపుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అధికారులెవరూ దీనిపై దృష్టి సారించడం లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లపై చొరవ తీసుకుంటే లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

# మైనార్టీ గురుకులం.. విద్యార్థులకు వరం



జగిత్యాల : నైపుణ్యంతో కూడిన విద్యతో పాటు నాణ్యమైన భోజనం వసతుల కారణంగా గురుకులాల్లో ప్రవేశాలకు పోటీ నెలకొంది. సాధారణంగా ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు నిర్వహిస్తారు. కాగా మైనార్టీ గురుకులాల్లో పరీక్ష నిర్వహించకుండానే నేరుగా ప్రవేశాలు కల్పించనున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి మైనార్టీ గురుకుల పాఠశాల, ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఐదో తరగతిలో నూతన ప్రవేశాలతో పాటు 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చు. జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు పలు వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు భర్తీ చేయనున్నారు. ఎలాంటి రుసుములు లేకుండా ఆన్‌లైన్‌లో (%tmreistelangana.cgg.gov.in%) ఆఫ్‌లైన్‌లో ఆయా పాఠశాలలు లేదా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించవచ్చు. రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు ఉమ్మడి జిల్లాలో మొత్తం 24 మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఐదో తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఓసీలకు 2 చొప్పున, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మైనార్టీలకు 30, బీసీలకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, ఓసీలకు ఒక సీటు చొప్పున కేటాయిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, వొకేషనల్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

**ఎంపిక విధానం...**

అయిదో తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 75 శాతం సీట్లు మైనార్టీలకు, 25 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కేటగిరీలకు కేటాయిస్తారు. మైనార్టీకోటాలో మొదట దరఖాస్తు చేసిన వారికి మొదటి ప్రాధాన్యతా క్రమంలో, మిగిలిన కేటగిరీలకు డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. 6,7,8 తరగతుల్లో ఖాళీ సీట్లను మైనార్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేస్తారు. సద్వినియోగం చేసుకోవాలి– కె.సురేష్, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల ప్రాంతీయ సమన్వయ అధికారిప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మైనార్టీలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గురుకులాల్లో ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇక్కడ మెరుగైన బోధనతో పాటు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. పలు అంశాల్లో విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇది వరం.

# భూముల క్రమబద్ధీకరణ ఎన్నడో?


పెద్దపల్లి : తెల్ల కాగితాలపై క్రయ విక్రయ ఒప్పందాలు రాసుకున్న వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణ కలగా మిగిలింది. 2014 జూన్ 2 నాటికి ముందు కొనుగోలు చేసిన భూములకు పట్టా హక్కులు కల్పిస్తామని గత ప్రభుత్వం 2021లో మీ సేవలో దరఖాస్తులు స్వీకరించింది. హైకోర్టు ఆదేశాలతో అప్పట్లో దరఖాస్తుల పరిశీలన నిలిపివేశారు. తర్వాత మంత్రి మండలి ఆమోదం తెలపడంతో పట్టా హక్కుల జారీలో అడ్డంకి తొలిగింది. కాగా అధికారుల నిర్లక్ష్యంతో రెండున్నరేళ్లుగా పట్టా హక్కుల జారీలో జాప్యం జరిగింది. తాజాగా ప్రభుత్వం నియమించిన ధరణి అధ్యయన కమిటీపై బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**1,12,517 దరఖాస్తులు**

ఉమ్మడి జిల్లాలో సాదాబైనామాలో 1,12,517 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా పెద్దపల్లిలో 35,580 అత్యల్పంగా రాజన్న సిరిసిల్లలో 15,056 నమోదయ్యాయి. 2016లో తొలి సారిగా సాదాబైనామాకు అవకాశం కల్పించడంతో వేలాది మంది లబ్ధి పొందారు. కొన్ని చోట్ల భూములు అమ్మిన వారు అడ్డు తిరగడం, కుటుంబీకులు కోర్టులకు వెళ్లడం, విక్రయించిన వారు స్థానికంగా నివాసం లేకపోవడం వంటి కారణాలతో కొంత ఇబ్బంది ఎదురైంది. కొత్త రెవెన్యూ చట్టంలో భాగంగా వీఆర్వోలను రెవెన్యూ విధుల్లో నుంచి తొలగించారు. పలు కారణాలతో దరఖాస్తులు పరిశీలించలేదు.

**అయిదెకరాల్లోపు ఉచితమే**

అయిదు ఎకరాల్లోపు వ్యవసాయ భూములను ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పట్టా మార్పిడి ఉంటుంది. ప్రభుత్వం తొలిసారిగా 2016లో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తీసుకోలేదు. అయిదెకరాల కంటే ఎక్కువ భూములకు ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు తీసుకోనున్నారు. ఒక వేళ పట్టాదారు కుటుంబ సభ్యులు, బంధువులు అభ్యంతరం తెలిపితే, హద్దు రైతుల వాంగ్మూలం తీసుకుని ఫారం–8 నోటీసులు జారీ చేసి గ్రామ పంచాయతీల్లో అంటిస్తారు. సమగ్రంగా విచారణ చేసిన తర్వాతనే పట్టా హక్కులు కల్పిస్తారు.



**ఫిర్యాదుల పరంపర**

కొత్త భూరికార్డుల హక్కుల(ఆర్వోఆర్) చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం లేకపోవడంతో 1971 ఆర్వోఆర్ చట్టంలోని క్లాజులను చేరుస్తూ.. ఆర్డినెన్స్ జారీ చేసేందుకు అప్పటి మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. దీంతో పట్టా హక్కుల జారీకి ఇబ్బందులు తొలగిపోయాయి. దరఖాస్తులు పరిశీలించడంలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఉన్నప్పటికీ పంట రుణం, రైతుబంధు, బీమా ఇతర ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. నెల రోజులుగా ధరణి అధ్యయన కమిటీ నిశితంగా పరిశీలిస్తుంది. చట్ట సవరణ చేసేందుకు సిఫారసు చేయడంతో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# సాదాబైనామా.. పరిష్కారం కలేనా?

సిరిసిల్ల : చిన్న, సన్నకారు రైతులు సాదాబైనామా దరఖాస్తుల ద్వారా తమ భూములకు హక్కు లభిస్తుందని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తెల్ల కాగితాలు, స్టాంప్ పేపర్లపై రాయించుకుని భూములు కొనుగోలు చేసుకున్న రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాదాబైనామా కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుం లేకుండా కేవలం యూజర్ ఛార్జీలు మాత్రమే తీసుకొని దరఖాస్తులను స్వీకరించారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రాగా, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కొందరు రహస్యంగా దస్తావేజుల విక్రయాలు జరిపి జేబులు నింపుకున్నారు. కానీ నేటికి మూడేళ్లు గడిచినా దరఖాస్తులు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా గడిచిన మూడేళ్ల కాలంలో పోడు భూముల దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసింది. అదే విధంగా సాదాబైనామా దరఖాస్తులను ఇప్పటికైనా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 15,056 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**2020లో దరఖాస్తుల స్వీకరణ**

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులను 2020 అక్టోబర్ 19 నుంచి అదే ఏడాది నవంబర్ 11 లోపు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మీ



సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగానే జిల్లాలోని 13 మండలాల ద్వారా 15,056 మంది రైతులు దరఖాస్తు చేసుకొన్నారు. అప్పట్లో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు కొందరు దీనిని ఆసరాగా తీసుకొని ఒక్కో దరఖాస్తుకు రూ.45 కాకుండా అవకాశాన్ని బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేశారు. అలాగే రూ.10 నుంచి రూ. 100 దస్తావేజులను పాత సంవత్సరానికి అనుగుణంగా తెచ్చుకోవడం కోసం రైతులు అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ వీటికి పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా ఉత్పన్నమైన భూ సమస్యలపై అధ్యయనం చేసి అందులో సాదాబైనామాకు కూడా అవకాశం కల్పించినట్లయితే దరఖాస్తుదారులందరికీ న్యాయం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు– ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్**

సాదాబైనామాకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వస్తే జిల్లాలో సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

# కాల్వలు మాయం..!

నకిరేకల్ : ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల వెంట ఉన్న స్థలాలే కాకుండా పొలాలకు నీరందించేందుకు నిర్మించిన పంటకాల్వలు (మైనర్లు) కూడా ఆక్రమణలతో మాయమవుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన మైనర్ల నిర్వహణకు నేటికి నిధులు కేటాయించకపోవడం, డిస్ట్రిబ్యూటరీల నుంచి పూర్తిస్థాయిలో వీటికి నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మైనర్ కాల్వలను ఎక్కడికక్కడ ఆక్రమించేస్తున్నారు. భవిష్యత్తులో ఏఎమ్మార్పీకి పూర్తిస్థాయిలో నీటి విడుదల కొనసాగితే పంటపొలాల వద్దకు నీటిని తీసుకొచ్చేందుకు ఈ కాల్వలు కీలకంగా మారనున్నాయి. ఇప్పుడు ఆక్రమణ చెరలో ఉన్న ఈ కాల్వలను కాపాడకుంటే రైతుల మధ్య తగాదాలు జరిగి శాంతిభద్రతల సమస్యలు రానున్నాయి.

వట్టిపోయి.. అన్యాక్రాంతమై..పీఏ పల్లి మండలంలో మొదలయ్యే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 135 కిలోమీటర్లు ప్రయాణించి నకిరేకల్ వద్ద మూసీ జలాశయంలో కలుస్తుంది. దీనికి 55 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, 250 మైనర్ కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వకు చివరి ప్రాంతం కావడంతో ఇక్కడి మైనర్లు నీరు అందక వట్టిపోయాయి. నీరు రాని కాల్వలను సమీపంలోని వారు ధ్వంసం చేసి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఏఎమ్మార్పీ ద్వారా 30 వేల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో..2005లో రూ.50 కోట్లతో 15 డిస్ట్రిబ్యూటరీలు, 50 మైనర్ కాల్వలు నిర్మించారు. నాడు కొన్ని మైనర్ల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. డి–40కి సంబంధించిన ఎల్.ఆర్ మైనర్ దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా ఆనవాళ్లు లేకుండా ఆక్రమణలకు గురైంది. మండలంలోనే పెద్దదైనా, చారిత్రక చందుపట్ల చెరువును ఏఎమ్మార్పీ నీటితో నింపేందుకు నిర్మించి ఎల్.ఆర్ కాల్వ పూడ్చివేతలు నేటికి కొనసాగుతున్నాయి.

**సమాచారం సేకరించి చర్యలు చేపడతాం**

పాండునాయక్, ఏఈ, నీటిపారుదల శాఖ, నకిరేకల్‌తమ శాఖ డివిజన్ల మార్పుల వల్ల ప్రస్తుతం పూర్తి వివరాలు అందుబా టులో లేవు. మైనర్లకు సంబంధించి నాడు సేకరించిన భూముల వివరాలను భూసేకరణ విభాగం నుంచి తెప్పించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఆక్రమణల నుంచి మైనర్ కాల్వలను కాపాడేందుకు చర్యలు చేపడతాం.

# వానరాలు పోలే.. వనాలే పోయాయి!

జగిత్యాల : పల్లెలు, పట్టణాల్లో వానరాల దాడులతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వీటిని నిలవరించేందుకు జిల్లాలో 57 ప్రాంతాలను గుర్తించి మంకీ ఫుడ్ కోర్టు(కోతుల ఆహార ప్రాంగణాలు) ఏర్పాటు చేశారు. వీటిలో వివిధ రకాల పండ్లనిచ్చే మొక్కలను అధికారులు, పాలకులు ఆర్భాటంగా నాటించారు. అంతేకాకుండా చుట్టూ కంచెలను ఏర్పాటు చేసి, రెండుమూడేళ్లు సంరక్షణ చేపట్టినా, ప్రస్తుతం పూర్తిగా విస్మరించారు. పిచ్చిమొక్కలతోపాటు మొక్కలు కనిపించకుండా పోయాయి.

**చేతులెత్తేసిన పంచాయతీలు**

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కోతుల ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేసి మండల స్థాయి అధికారులకు సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ పాలకవర్గాలు, రెవెన్యూ అధికారులు సూచించిన స్థలాల్లో ఇప్ప, కరక్కాయ, జామ, ఉసిరి, మారేడు, సీతాఫలం, నేరేడుతోపాటు వివిధ రకాల మొక్కలను నాటారు. గ్రామీణాభివృద్ధి శాఖ కొంత కాలం నిర్వహణ బాధ్యత తీసుకుని ఆ తరువాత పంచాయతీలకు అప్పగించారు. పాలక వర్గాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. కొద్దిపాటి మొక్కలు మిగిలి ఉన్న గ్రామాల్లోనైనా సంరక్షణ చర్యలు చేపట్టి కోతుల ఇబ్బందులు తొలగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణలో వందమంది శివబాలకృష్ణలు.. ఏసీబీ కన్ను




హైదరాబాద్ : ఆయన హైదరాబాద్ లో ఫేమస్ 'కొండ'లో పనిచేసిన ఓ అధికారి.. కొద్దికాలంలోనే రూ.70 కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి.. ఏడాపెడా అనుమతులిచ్చి.. అందినంత జేబులో వేసుకున్నారు. తీరిగ్గా వేరేచోటుకు బదిలీ అయ్యారు. ఈయన మొత్తం ఆస్తి రూ.150 కోట్లకు పైనే అని చెబుతారు. అంటే.. హైదరాబాద్ లో ఈయన మరో శివబాలకృష్ణ అన్నమాట. ఈయనొక్కరే కాదు.. రాష్ట్రంలో ఇలాంటివారు వందమంది ఉంటారని అంచనా. ఇప్పుడు వీరందరి పనిపట్టేందుకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సిద్ధమైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ సంఘటన ఎంతటి సంచలనం రేపిందో అందరికీ తెలిసిందే. రూ.కోట్లు కొల్లగొట్టిన ఆయన బినామీలపైనా ప్రభుత్వం కన్నేసింది. శివబాలకృష్ణ ఓ ఐఏఎస్ అధికారికి రూ.10 కోట్లు చెల్లించాడంటేనే ఆయన దోపిడీ ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఈయన ఆస్తుల విలువ రూ.150 కోట్లు అని చెబుతున్నారు. కానీ, 500 కోట్ల వరకు ఉండొచ్చని భావన. ఇలాంటివారి లెక్క తేల్చాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ చూస్తోంది. అవసరమైన ఏర్పాట్లు కూడా చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో కొన్నేళ్లుగా పాతుకుపోయి, అడ్డగోలుగా ఆర్జించిన వారి వివరాలు తెలుసుకుంటోంది. నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తోంది.

**ఒక్కరు కాదు వందలు..** శివబాలకృష్ణ లాంటి అధికారులు వందల్లో ఉంటారని తెలంగాణ ఏసీబీ భావిస్తోంది. కొన్ని శాఖల్లో అధికారులపై కొంతకాలంగా పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి.

వీరిలో రెవెన్యూ, పోలీసు, ఆబ్కారీ, పురపాలక, హెచ్ఎండీఏ, రెరా ముఖ్యమైనవి. భూముల ధరలు భారీగా పెరగడం, స్థిరాస్తి వ్యాపారం జోరుగా ఉండడంతో టౌన్ ప్లానింగ్ వంటి శాఖల అధికారులు భారీగా ఆర్జించారని.. ఇసుక తవ్వకాల్లోనూ ముడుపులు దండుకున్నారనే ఆరోపణలున్నాయి.

**ట్రాప్ కాదు.. నేరుగా దాడే..** తెలంగాణ ఏసీబీ ఇప్పటివరకు ట్రాప్ కేసులకు పరిమితమైంది. ఎవరైనా ఆరోపణలు చేస్తేనే.. అవినీతి అధికారులను పట్టుకోవడం అన్నమాట. ఇకమీదట మాత్రం ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అధికారిని గుర్తించడం, ఎలా సంపాదిస్తున్నారు, ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారు, బినామీలు, బంధువులు, స్నేహితుల ఇళ్లు వంటి అవినీతి అధికారుల చిట్టాతో నేరుగా దాడి చేయాలని చూస్తోంది. పక్కా ఆధారాలతో ముందుకెళ్లాలని చూస్తోంది. అయితే, నెల రోజుల కసరత్తుతో దీనిని చేపట్టనుంది. దీనికి పదుల సంఖ్యలో సిబ్బంది రహస్యంగా పనిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అరికట్టాలంటే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు పెరగాలి. అప్పుడే అడ్డగోలుగా సంపాదిస్తే పట్టుబడతామనే భయం వస్తుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా ఏసీబీ కేసులపైనా దృష్టి సారించింది. ప్రత్యేకంగా సిబ్బందిని కూడా కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా అక్రమార్కుల వివరాలను సేకరించనున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి డీఎస్సీ-2008 అభ్యర్థులు



హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి డీఎస్సీ-2008 అభ్యర్థులు భారీగా చేరుకున్నారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చేందుకు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసం వద్దకు వచ్చారు. తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం కామన్ మెరిట్‌లో ఎంపికై నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఆరు వారాల్లో పోస్టులను భర్తీ చేయాలని గతంలో హైకోర్టు తీర్పు వెలువరించిందని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అభ్యర్థులు వాపోయారు. న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు.

# తెలంగాణలో 10 ఎంపీ సీట్లు కచ్చితంగా గెలుస్తాం: భాజపా ఎంపీ లక్ష్మణ్



దిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీది గాలివాటం గెలుపని భాజపా ఎంపీ లక్ష్మణ్ అన్నారు. భారాస కుటుంబపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో గెలుపు భాజపాదేనని లక్ష్మణ్ అన్నారు. 17 సీట్లలోనూ గట్టి పోటీ ఇస్తామని.. 10కి తక్కువ కాకుండా గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. రహస్య ఒప్పందం మేరకు కాంగ్రెస్, భారాస సహకరించుకుంటున్నాయని చెప్పారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్‌తో విసిగిపోయి తమకు భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతోనే కూటమి పార్టీలు, నేతలు బయటకు వస్తున్నారన్నారు.

# జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారిపోయింది. గ్రేటర్ హైదరాబాద్ సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య బాహాబాహీ నడిచింది. జీహెచ్ఎంసీ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏకరువు పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో అన్ని సమస్యలే అని.. జీహెచ్ఎంసీ వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. పాలన పడకేసిందన్నారు. కనీసం స్ట్రీట్ లైట్స్ కూడా వెలగడం లేదని విమర్శించారు. హైదరాబాద్ పరువు పోతుందన్నారు. జీహెచ్ఎంసీలో పని చేయడం కోసం డబ్బులు లేవు, అధికారులు లేరు అంటూ వ్యాఖ్యలు చేశారు. కాగా.. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వ్యాఖ్యలను కాంగ్రెస్ కార్పొరేటర్లు తప్పుబట్టారు. అధికారులను నిర్లక్ష్యంగా చేసింది, వ్యవస్థలు నిర్వీర్యం అవ్వడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం మారగానే సమస్యలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. మేయర్ పోడియం వద్ద కాంగ్రెస్ కార్పొరేటర్లు నిరసనకు దిగారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో సమస్యలు ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినవి కాదన్నారు. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ జీహెచ్ఎంసీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం లెక్క తాము జీహెచ్ఎంసీ పక్కన పెట్టమన్నారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

**కార్పొరేటర్ల ఆగ్రహం... మేయర్ సమాధానం :** కౌన్సిల్ హాల్‌లో అధికారుల సమాధానాలపై కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో స్ట్రీట్ లైట్స్ సమస్య తీవ్రంగా ఉందని కార్పొరేటర్లు తెలిపారు. ఆఫీస్‌లలో కూర్చొని కౌన్సిల్ సమావేశంలో అబద్ధాలు చెప్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా అధికారులు కనీసం సమీక్ష చెయ్యలేదన్నారు. కార్పొరేటర్ల అసంతృప్తిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించారు.

ఆయా సమస్యలపై హౌస్ కమిటీ వేద్దామన్నారు. అధికారులు జోనల్ సమావేశాలు కనీసం తనకు కూడా సమాచారం ఇవ్వలేదన్నారు. జోనల్ సమావేశాలకు కార్పొరేటర్లకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని మేయర్ ప్రశ్నించారు. జోనల్ వారీగా స్ట్రీట్ లైట్స్ సమస్య ఉంటే కేబుల్ శాంక్షన్ ఇవ్వడం లేదని ఎంఐఎం కార్పొరేటర్లు వెల్లడించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.


సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# ప్రభుత్వ విప్ ప్రయాణిస్తున్న కారుకు పెను ప్రమాదం..

కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రయాణిస్తున్న కారుకు పెను ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట వద్ద కారు బోల్తా పడింది. ఘటన సమయంలో విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారులోనే ఉన్నారు. ఆయనతో పాటు కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే క్రమంలో ఘటన చోటు చేసుకుంది. గాయపడిన వారిని చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాస్పిటల్ వైద్యుల తో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం లక్ష్మణ్ ను హైదరాబాద్‌కు తరలించారు.

# నేటి నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్ర




## రాష్ట్రంలో పది లోక్‌సభ స్థానాలే లక్ష్యంగా.. వచ్చే నెల 1వ తేదీ వరకు విస్తృత ప్రచారం హాజరుకానున్న కేంద్రమంత్రులు, సీఎంలు

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్ర బీజేపీ విజయ సంకల్ప యాత్రకు సిద్ధమైంది. వచ్చే ఎన్నికల్లో కనీసం 10 లోక్‌సభ స్థానాలు, 35 శాతం ఓటు బ్యాంకు సాధించాలని ఆ పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా ఈనెల 20 (మంగళవారం) నుంచి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టబోతోంది. బీజేపీ మూడోసారి అధికారంలోకి ఎందుకు రావాలో వివరిస్తూ, రాష్ట్రానికి సంబంధించి గత పదేళ్లలో కేంద్రం అందించిన సహకారాన్ని ప్రజలకు తెలియజేయనుంది. అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని సుసాధ్యం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని పేర్కొంటూ, ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమైందని, ప్రభుత్వ వైఖరిని ప్రచారంలో ఎండగట్టనున్నామని బీజేపీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లు (ఒక్కో క్లస్టర్‌లో 3 లేదా 4 ఎంపీ స్థానాలు)గా విభజించిన బీజేపీ నాయకత్వం.. వీటిల్లో వచ్చే నెల ఒకటో తేదీ వరకు యాత్రలు చేపట్టబోతోంది. కుమ్రం భీం క్లస్టర్ ముథోల్‌లో ప్రారంభమయ్యే యాత్ర బోధన్‌లో ముగియనుంది. ఈ క్లస్టర్ పరిధిలోని మూడు ఎంపీ, 21 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగనుంది. అలాగే రాజరాజేశ్వరి క్లస్టర్ తాండూరు-కరీంనగర్ (4 ఎంపీ, 28 అసెంబ్లీ నియోజకవర్గాలు), భాగ్యలక్ష్మి క్లస్టర్ భువనగిరి-హైదరాబాద్ (3 ఎంపీ, 21 అసెంబ్లీ), కృష్ణమ్మ క్లస్టర్ మక్తల్‌లో ప్రారంభమై నల్లగొండ (3 ఎంపీ, 21 అసెంబ్లీ) వరకు కొనసాగనుంది. అయితే మేడారం సమ్మక్క-సారక్క మహా జాతర దృష్ట్యా కాకతీయ-భద్రకాళి క్లస్టర్‌లో మాత్రం ఈ నెల 25 నుంచి భద్రాచలం-ములుగు (3 ఎంపీ, 21 అసెంబ్లీ నియోజకవర్గాలు) వరకు యాత్ర సాగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో పాటు పార్టీ సీనియర్ నేతలు, కేంద్రమంత్రులు, పలువురు సీఎంలు ఈ యాత్రల్లో పాల్గొంటారు.

అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ.. 20న ఉదయం 11 గంటలకు కుమ్రం భీం క్లస్టర్ ప్రారంభ కార్యక్రమంలో ముథోల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్.. రాజ రాజరేశ్వరి క్లస్టర్ ప్రారంభ యాత్రలో భాగంగా తాండూరులో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఇక సోమవారం ఈ యాత్రల ప్రచార రథాలకు కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించరు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 9 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు కూడా పాల్గొంటారు.

# గ్రూప్ -1 నోటిఫికేషన్ రద్దు.. టీఎస్‌పీఎస్సీ ప్రకటన




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం వెబ్‌నోట్‌ను విడుదల చేసింది. 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులతో గత ప్రభుత్వం గ్రూప్-1 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.

అయితే, పేపర్ లీకేజీ కారణంగా ఒకసారి, నిబంధనలు సరిగా పాటించలేదని రెండోసారి ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేశారు. ఇటీవల మరో 60 గ్రూప్ -1 పోస్టులకు కొత్త ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తూ టీఎస్‌పీఎస్సీ నిర్ణయం తీసుకుంది. మొత్తం పోస్టులతో కలిపి త్వరలోనే కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

# మేడారం వెళ్లే వీఐపీలకు మంత్రి సీతక్క కీలక సూచన



హైదరాబాద్: మేడారం జాతరపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతరకు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. వారి కోసం అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు జాతర వివరాలు సేకరిస్తూ.. బడ్జెట్ కేటాయిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. వీఐపీలు వారి వాహనాలను ములుగులో ఉంచి బస్సులో మేడారం వెళ్లాలని సూచించారు. జాతరకు ఖర్చు చేసే ప్రతి రూపాయి వివరాలు ప్రజల ముందుంచుతామన్నారు. సమ్మక్క-సారలమ్మ చరిత్రను శిలాశాసనం చేసి మేడారంలో ఏర్పాటు చేస్తామని సీతక్క తెలిపారు.

# కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డికి ధర్మపురి అర్వింద్ సవాల్

హైదరాబాద్: కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డికి బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన సవాలు విసిరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డిపై పోటీకి తాను సిద్ధమని అన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కొలేకనే జీవన్ రెడ్డి సోదరుడు తనపై కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జీవన్ రెడ్డి నాకు తండ్రి సమానుడు. ఆయన ఎదురుపడిన ప్రతిసారి వంగి ఆశీర్వాదం తీసుకుంటాను. సీనియర్ నేతగా ఉండి చిల్లర రాజకీయాలు చేయడం సరైంది కాదు. జగిత్యాలలో బీజేపీ బలపడుతుండడాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. 2014 నుంచి ఇదే తనకు చివరి ఎన్నికలని జీవన్ రెడ్డి చెబుతున్నారు. జీవన్ రెడ్డితో రాజకీయంగా కొట్లాడటానికి నేను సిద్ధం" అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో పార్టీలు, నేతల మధ్య పరస్పర మాటల దాడి పెరుగుతున్న విషయం తెలిసిందే.

# జవహర్‌నగర్ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

జవహర్‌నగర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్యపై అసమ్మతి వర్గం పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. నగరపాలక సంస్థలో మేయర్ సహా 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. సోమవారం ఓటింగ్ నిర్వహించగా 20 మంది ఆమెకు వ్యతిరేకంగా ఓటేశారు. ఈ మేరకు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాస తీర్మానంపై సమావేశానికి అసమ్మతి వర్గానికి చెందిన 20 మంది కార్పొరేటర్లు ప్రత్యేక వాహనంలో హాజరయ్యారు. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ ఓటింగ్ నిర్వహించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మొత్తం 28 మంది కార్పొరేటర్లు ఉండగా.. గతంలో అనారోగ్యంతో 16వ డివిజన్ కార్పొరేటర్ మృతి చెందారు. మిగిలిన 27 మందిలో 20 మంది మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తూ ఓటేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. 20 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేసినట్లు ప్రకటించారు. సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఓటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జవహర్‌నగర్ ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు.

**స్వలాభం కోసం ఈ ప్రక్రియకు తెరలేపారు: మేకల కావ్య –** అవిశ్వాసం నెగ్గిన నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి మేయర్ కావ్య వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై అకారణంగా అవిశ్వాసం ప్రకటించారని..

అసమ్మతి వర్గంలోని కొందరు తమ స్వలాభం కోసం ఈ ప్రక్రియకు తెర లేపారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జాదారులతో కూడిన అసమ్మతి వర్గం నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660